ఎమెస్కో

# హిట్ లిస్ట్

మంజరి



# విట్నెస్

మంజరి

# హిట్‌లిస్ట్

రచన: **మంజరి**

చిరునామా: జి. నాగేశ్వరరావు,
2-102, కామాక్షి నగర్
కంటోన్మెంట్,
విజయనగరం - 535 003
ఫోన్: 94415 71994

E-mail: nageswar.gandham@gmail.com

© అన్ని హక్కులు రచయితవి.

ప్రథమ ముద్రణ: జూన్, 2008

డి.టి.పి : **శిరీష జంపన**

ధర : **రూ: 120/-**

**సాగర్ పబ్లికేషన్స్**
**విజయనగరం**

Manjari other e-Books please visit www.kinige.com

# హిట్‌లిస్ట్

భారత సరిహద్దుకి అవతల పది కిలోమీటర్ల దూరంలోని ఒక గుర్రం ఉత్తరం వైపుకి పరుగెడుతోంది.

గాలితో పోటీ పడుతున్నట్టు దూసుకుపోతుంది.

చాలా దూరం నుంచి వస్తున్నట్టు గుర్రం ముక్కు పుటాలు విస్తరించాయి. నోటినుండి నురగలొస్తున్నాయి.

ఆ ప్రాంతం చిన్న చిన్న తుప్పలతోను, పిచ్చి మొక్కలతోను నిర్మానుష్యంగా కనిపిస్తోంది. దాదాపు రెండుగంటల తరువాత గుర్రం ఒక తోట దగ్గర ఆగింది.

అంతవరకూ గుర్రం మీద ప్రయాణం చేసిన వ్యక్తి కిందకు దిగి, గుర్రాన్ని ఒక చెట్టుకి కట్టేశాడు.

అతనికి అరవై సంవత్సరాలు వుంటుంది వయస్సు. ఆరడుగుల పొడవుతో బలంగా వున్నాడు. లోతుకుపోయిన కళ్ళచుట్టూ నల్లని గీతలు ఏర్పడడంవల్ల అతని కళ్ళు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతని చూపు మాత్రం తీక్షణంగా వుంది. వత్తుగా పెరిగిన గెడ్డం, తలపాగా అతనికి నిండుదనాన్నిచ్చాయి.

అతను తోటలోకి నడిచాడు. తనకు పరిచయములేని పరిసరాలను పట్టిపట్టి చూస్తూ చెట్లను దాటుకుని బాగా లోపలకు వెళ్ళాడు. పెద్దగేటు ఒకటి ఎదురయింది. గేటుకి రెండు పక్కలా ఎత్తయిన గోడ కనిపిస్తోంది. అతను గేటువైపు కదిలాడు. గేటు దగ్గర నిలబడ్డ సెంట్రీ రైఫిల్ అతని వైపు తిప్పి, “తుమ్...కౌన్ అడిగాడు ఖంగుమనే గొంతుతో.

అతను ఆగి సెంట్రీవంక చూసి ఏమాత్రం తడబడకుండా చెప్పాడు “దోస్త్”

“పెహచాన్ కేలియే ఆగే బడ్” అదే గొంతుతో చెప్పాడు సెంట్రీ రైఫిల్ దించకుండా.

అతను రెండు చేతులూ పైకెత్తి సెంట్రీవైపు నడిచాడు. సెంట్రీ ముందు

ఆగి తన జేబునుండి ఒక కాగితం తీసి యిచ్చాడు. సెంట్రీ ఆ కాగితాన్ని పరిశీలించిన తరువాత గేటుకి అమర్చిన చిన్న తలుపు తెరిచాడు. అందులోంచి ఒక మనిషి మాత్రమే వెళ్ళడానికి వీలవుతుంది. అతను కాగితం తీసుకుని లోపలకు నడిచాడు. అతని వెనుక తలుపు మూసుకుంది.

అతను చుట్టూ పరిశీలనగా చూశాడు.

లోపల విశాలంగా పెద్ద మైదానంలా వుంది. అక్కడక్కడా చిన్న చిన్న కట్టడాలు కనిపిస్తున్నాయి. వాటిని కవరుచేస్తూ చుట్టూ ఎత్తయిన గోడ నిర్మింపబడింది. గోడ పై భాగములో తీగలు అమర్చారు. అందులో కరెంటు ప్రవహిస్తూ వుండొచ్చు.

లోపల ఏం జరుగుతున్నదో తెలియకుండా కొన్ని వందల ఎకరాల తోటలో చుట్టూ చెట్లను వదిలి మధ్యలో నిర్మించారు.

సరిహద్దు రక్షణకోసం ప్రతి క్షణం అప్రమత్తంగా సంచరించే ఆ దేశ సైనికులకు ఆ నిర్మాణము గురించి తెలియదని చెప్పినా, అసలు అటువంటివి నిర్వహించడానికి ఆ దేశం ఎటువంటి సహాయము చెయ్యడం లేదన్నా అది వాదనకు పనికొస్తుంది తప్ప వాస్తవము కాదు.

అతను ఆలోచన నుండి తేరుకుని సమీపములోని కట్టడం వైపు నడిచాడు.

చెక్కలతో నిర్మించబడ్డ ఆ కట్టడం చాలా చిన్నది. అతను లోపలకు వెళ్ళాడు. ఒక వ్యక్తి యూనిఫాం ధరించి కుర్చీలో కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. అడుగుల చప్పుడుకి తలెత్తాడు. ఆ వ్యక్తికి తను తెచ్చిన కాగితం చూపించాడు.

"నాతో రండి" చెప్పి బయటకు వచ్చాడు ఆ వ్యక్తి. పదడుగుల దూరంలోని ఓ పెద్ద కట్టడము దగ్గరకు తీసుకెళ్ళాడు. అక్కడే నిలబడ్డ మనిషితో చెప్పాడు.

"వీరికి ఒక గది చూపించు" అని.

అతనివైపు తిరిగి అన్నాడు. "మీరు విశ్రాంతి తీసుకోండి, కమాండర్ రాత్రికి తిరిగొస్తారు."

అతను మౌనంగా ఆ మనిషితో పాటు లోపలకు ప్రవేశించాడు. ఆ మనిషి అతనికి ఒక గది చూపించాడు.

అతను గదిలోకి నడిచాడు. ఒక మూల మంచం పక్కనే చిన్న స్టూలు, దానిమీద మంచినీళ్ళ కూజా, గ్లాసు వున్నాయి.

అతను మంచం మీద కూర్చుని కూజాలోని నీళ్లు గ్లాసులోకి వంచుకుని తాగాడు. మరో గ్లాసునీళ్ళు తాగి అలసటగా మంచంమీద వాలిపోయాడు.

అరవై సంవత్సరాల వయసులో సరిహద్దు దాటి మరో దేశంలోకి ప్రవేశించడం అంటే సామాన్య విషయం కాదు. ఎంతో తెగింపు, పట్టుదల వుంటే తప్ప సాధ్యం కాదు. ఆ సమయంలో అటువంటి పని చెయాల్సి రావడం నిజంగా దురదృష్టం.

అతను కళ్ళు మూసుకున్నాడు.

కొడుకులు గుర్తొచ్చారు. గుండెల్లోని దుఃఖం, కడుపులోని ఆవేదన కలిసి అశ్రువులుగా రూపాంతరము చెంది, మూసిన కనురెప్పల వెనుక గూడుకట్టి, కంటి చివర్ల నుండి కణతల మీదుగా జారి మంచంమీద పడ్డాయి. సంవత్సరం నుండి ఆ కళ్ళు నిర్విరామంగా వర్షిస్తున్నాయి. కాలం దుఃఖాన్ని తగ్గిస్తుందని, వేదన తాలూకు తీవ్రత మరిపిస్తుందని చెబుతారు. కానీ అతని విషయంలో మాత్రం అది నిజం కాలేదు.

అతని మనసు గతంలోకి వెళ్ళింది.

విచిత్రమయినది, విశిష్టమయినది మనిషి జీవితం. అది ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో, ఎప్పుడు సమస్యలు ఎదుర్కుంటుందో ఊహకందదు. జీవితం సాఫీగా సాగినంతకాలం ఆలోచించినట్టు, ఎదురుదెబ్బ తిన్నప్పుడు మనిషి ఆలోచించలేడు. సరిగ్గా అదే జరిగింది జోగిందర్‌సింగ్ పేరుగల ఆ అరవై సంవత్సరాల వృద్ధుని విషయంలో.

జోగిందర్ సింగ్ ఫిరోజ్‌పూర్ పక్కన చిన్న గ్రామానికి చెందిన వాడు. అతను చదువుకునే రోజుల్లో ప్రాథమికవిద్య పూర్తిచేసి సైనికునిగా చేరాలని అనుకునేవాడు. అయితే పద్దెనిమిది సంవత్సరాలు నిండకుండానే అతని తల్లిదండ్రులు గతించారు.

తప్పనిసరి పరిస్థితిలో తండ్రి వదిలిన వ్యవసాయం చేపట్టాడతను. దేశాన్ని ప్రేమించడమంటే సైనికునిగా చేరడం ఒక్కటే మార్గం కాదని, పుష్కలంగా పంటలు పండించి కూడా దేశం పట్ల ప్రేమ ప్రకటించుకోవచ్చునని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు.

పూర్తికాలాన్ని వ్యవసాయం కోసము వెచ్చించడం వల్ల, పెద్దరికము ప్రదర్శించే బంధువులు లేకపోవడంవల్ల జోగిందర్‌సింగ్‌కి ముప్పై వచ్చేవరకూ

పెళ్ళికాలేదు. ఆ తరువాత అనుకూలవతి భార్యగా దొరకడంతో రోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

జోగీందర్‌సింగ్ జీవితంలో పెళ్ళిమాదిరిగానే పిల్లలు పుట్టటము కూడా ఆలస్యమయింది. పెళ్ళయిన పది సంవత్సరాలకు కవలపిల్లలు జన్మించారు. భార్య పురిటి మంచం మీద పోయింది.

ఒకపక్క దుఃఖాన్ని భరిస్తూ, మరోపక్క సంతోషం ప్రకటించడం అనేది విచిత్రమయిన స్థితి. ఒకదాని ప్రభావం మరో దానిమీద లేకుండా వుండాలంటే మనిషికి ఎంతో వివేచన కావాలి. జోగీందర్ సింగ్ పిల్లలపైనా దృష్టి నిలిపి దుఃఖాన్ని దిగమింగాడు.

తాత పేరు గోవింద్ పెద్దవాడికి, తండ్రిపేరు అమర్జిత్ చిన్నవాడికి పెట్టుకున్నాడు జోగీందర్. ఇద్దరు పిల్లలు తెలివయినవాళ్ళు, చురకయిన వాళ్ళు. అంతేకాదు అచ్చుగుద్దినట్టు ఇద్దరూ ఒకే పోలిక అదీ తల్లి పోలిక. తల్లిలేని లోటు తెలియకుండా పిల్లల్ని గుండెల్లో పెట్టుకుని, గుండెమీద ఆడించి పెంచాడు.

ఇద్దరూ ఒకేసారి డిగ్రీలోకి ప్రవేశించారు. వేసవి శలవులకు ఇంటి కొచ్చారు. ఇంటివద్ద లగేజి పడేసి పొలంలో పనిచేసుకుంటున్న తండ్రి దగ్గరకు పరిగెత్తారు. జోగీందర్ సింగ్ ఎందుకో తలెత్తి చూశాడు. ఇద్దరు యువకులు తనవైపు పరుగెత్తుకుని రావడం మసగ్గా కనిపించింది. అప్రయత్నంగా చేతిలోని పార నేలమీద పడింది.

తనని సమీపించిన కొడుకుల్ని రెండు చేతులతో పట్టుకుని గుండెలకు హత్తుకున్నాడు. ఒకనాడు సున్నితంగా గుండెలకు తగిలిన వాళ్ళ శరీరం ఇప్పుడు దృఢంగా తగులుతోంది. ఆనందంతో జోగీందర్ సింగ్ గుండెలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. రూపం తల్లిది. శరీర నిర్మాణము తండ్రిది. కొడుకులను చూసిన తరువాత జోగీందర్ ఛాతీ రెండంగుళాలు విస్తరించింది.

ఉగ్రవాదం వెర్రితలలు వేస్తూ గ్రామ గ్రామాలకు పాకుతున్న రోజులవి. వివిధ ఉగ్రవాద సంస్థలు నిరుద్యోగ యువకులను ఆకర్షించి తమ సంస్థల్లో చేర్చుకుంటున్నాయి. ఓసారి ఉగ్రవాది ఒకతను జోగిందర్ సింగ్ గ్రామం వచ్చాడు. గ్రామస్తులను సమావేశపరచి ఉపన్యాసము చెప్పసాగాడు. అతని మాటలకు గ్రామస్తులు ఏమాత్రం స్పందించలేదు.

గ్రామస్తులు తనని పట్టుకుని పోలీసులకు అప్పగిస్తారని అతను

అనుమానించాడు. తన చుట్టూ గుమిగూడిన ప్రజల్ని భయపెట్టాలనే ఉద్దేశంతో ఆటోమేటిక్ వెపన్‌ని వాళ్ళవైపు తిప్పాడు. అనుకోకుండా వెపన్ ఫైర్ అయింది. అందులోంచి వెలువడిన తూటాలు ఒక వృద్ధురాలి గుండెల్లోకి దూసుకుపోయాయి. ఆమె నేలకూలి ప్రాణాలు వదిలింది.

అక్కడే నిలబడ్డ గోవింద్ పట్టలేని కోపంతో ఉగ్రవాది మీదకు దూకాడు. ఒకే ఒక గుద్దుతో అతన్ని నేలకూల్చి వెపన్ దొరకబుచ్చుకుని ఉగ్రవాదిని కాల్చాడు గోవింద్. అప్పటికి గ్రామంలోకి ప్రవేశించిన పోలీసులు, కాల్పుల శబ్దానికి పొజిషన్ తీసుకుని సంఘటన జరిగిన ప్రదేశం చేరుకున్నారు.

చేతిలో ఆయుధంతో రెండు శవాల మధ్య నిలబడి పోలీసులకు కనిపించాడు గోవింద్. ఆవేశంలో ఉగ్రవాదిని కాల్చి చంపాడు. కానీ తను చేసింది గుర్తించి అతను షాక్ తిన్నాడు. బిల్డింగ్ చాటుకి చేరుకున్న సబ్‌ఇన్స్‌పెక్టర్ ఆలస్యం చెయ్యకుండా గోవింద్‌ని కాల్చాడు. అతని శరీరం బుల్లెట్ గాయాలతో కిందపడింది. అది చూసి సబ్‌ఇన్స్‌పెక్టర్ వైపు చిరుతపులిలా దూసుకుపోయాడు అమర్జిత్. సబ్‌ఇన్స్‌పెక్టర్ తన ఆయుధం అమర్జిత్ మీదా వుపయోగించాడు.

ఆ సమయానికి తన వ్యవసాయ క్షేత్రంలో వున్నాడు జోగీందర్ సింగ్. ఒక గ్రామస్తుడు పరిగెత్తుకుని వచ్చి జరిగింది చెప్పాడు. అతను వెంటనే స్పృహ తప్పి పడిపోయాడు. తిరిగి స్పృహ వచ్చేసరికి పోలీసులు శవాలను తీసుకుని వెళ్ళిపోయారు.

శవాలను జీపులో ఒకదానిమీద ఒకటి వేసుకుని తీసుకెళ్ళిన దృశ్యం ఊహామాత్రంగా కదులుతుండగా జోగీందర్‌సింగ్ ఫిరోజ్‌పూర్ వెళ్లాడు.

పోలీసు అధికారులు కొడుకుల శవాలు ఇవ్వడానికి అంగీకరించలేదు. అతనికి విపరీతమయిన కోపం వచ్చింది. దానిని కంట్రోలు చేసుకోవడానికి చాలా శక్తిని ఖర్చు చేశాడు. తనని కూడా కాల్చి చంపి ఉగ్రవాది అనేముద్ర వేయడానికి పోలీసులు వెనుదియ్యరని గ్రహించాడు.

జోగీందర్ సింగ్ బాధని గుర్తించిన ఒక కానిస్టేబుల్, గెస్ట్‌హౌస్‌లో డి.జి.పి. వున్నాడని, వెళ్ళి అతనికి చెప్పుకోమని చెప్పాడు. అతను డి.జి.పి దగ్గరకు వెళ్ళి తనకి జరిగిన అన్యాయం చెప్పుకున్నాడు. అతను న్యాయం చేస్తానని చెప్పి జోగీందర్ పంపించి వేశాడు. ఈలోపు పోలీసులు శవాలను ఖననం చేశారు.

ముగ్గురు ఉగ్రవాదుల్ని ఎదుర్కొని హతమార్చిన సబ్‌ఇన్స్‌పెక్టర్‌కి అత్యుత్తమ

సేవాపతకం, ఇన్స్పెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చినట్టు రెండురోజుల తరువాత పేపరులో వచ్చింది. ఆ వార్త చదివి జోగీందర్ సింగ్ మౌనంగా వుండిపోయాడు.

ముడతలుపడ్డ అతని మొహం భావరహితంగా మారింది. హఠాత్తుగా పది సంవత్సరాల వయసు మీదపడినట్టు శరీరం శుష్కించింది. క్రమంగా గ్రామ ప్రజలతో మాట్లాడడం మానేశాడు. తన చుట్టూ శూన్యాన్ని సృష్టించుకుని దానిలో నివసిస్తూ, ఆ శూన్యంలోకి చూస్తూ పొలం గట్టుమీద కూర్చునేవాడు.

క్రమంగా జోగీందర్ సింగ్ తన ఆస్తులు మొత్తం అమ్మేశాడు. ఇంట్లో వస్తువులు కూడా వుంచలేదు. రెండు రోజుల తరువాత తను అమ్మేసిన పొలం దగ్గర నిలబడి నీళ్ళు నిండిన కళ్ళతో పొలాన్ని చూస్తున్న సమయంలో, ఫిరోజ్‌పూర్ నడిరోడ్డు మీద ఓ ఉగ్రవాద సంస్థ మనుషులు జోగీందర్ సింగ్ కొడుకులను చంపిన ఇన్స్పెక్టర్ని కాల్చి చంపారు. అది ఉగ్రవాదుల ఉన్మత్తచర్యగా అధికారులు ప్రజలు భావించారు.

పదిరోజుల తరువాత ఓ ఉగ్రవాద సంస్థ లెఫ్టినెంట్‌ని రెండోసారి కలుసుకున్నాడు జోగీందర్.

తన జీవితంలో చెయ్యాల్సిన చివరి పని గురించి అతనితో చర్చించాడు. అతని సలహా ప్రకారం టెర్రరిస్టు ట్రైనింగు క్యాంప్‌కి వచ్చాడు.

చీకటి పడిన తరువాత క్యాంప్‌కి తిరిగొచ్చిన కమాండర్ అతని రూములో కలుసుకుని తను తెచ్చిన ఉత్తరం యిచ్చాడు జోగీందర్ సింగ్.

కమాండర్ ఉత్తరం చదవడం ముగించిన తరువాత జోగీందర్ చెప్పాడు. "నా పేరు జోగీందర్ సింగ్. లెఫ్టినెంట్ పంపించాడు."

కమాండర్ అర్థమయినట్టు తలూపాడు. నల్లటి యూనిఫాంలో అతను బలిష్టంగా వున్నాడు. అతని ఛాతీమీద పతకాలు వేలాడుతున్నాయి. అతను కదిలినప్పుడల్లా అతనితోపాటు అవి కూడా కదులుతున్నాయి.

టేబుల్ మీద రమ్ముతో నిండిన గ్లాసు వుంది. దానిని అందుకుని కొద్దిగా తాగాడు.

"నీకు సహాయం చెయ్యమని లెఫ్టినెంట్ ఉత్తరంలో రాశాడు. అంతదూరం నుంచి వచ్చావంటే నీ పని ముఖ్యమయినది అయి వుంటుంది" సాలోచనగా అని జోగీందర్ సింగ్ మొహంలోకి చూశాడు.

"అవును" అని ఓక్షణం తరువాత స్థిరంగా చెప్పాడు, "చాలా ముఖ్యమయినది."

కమాండర్ సిగరెట్ వెలిగించుకున్నాడు.

"ఆ పని ఏమిటి?" అడిగాడు.

"మీ దగ్గర ట్రయినింగ్ పొందిన ఓ మనిషి నాకు కావాలి" చెప్పాడు.

"ఎందుకు?"

"నా శత్రువుని చంపడానికి?"

"ఎవరా శత్రువు?" ఆశ్చర్యంగా అడిగాడు. చాలా సంవత్సరాల నుండి ట్రైనింగ్ క్యాంప్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. యువకులకు ట్రయినింగ్ ఇవ్వడంతో అతని బాధ్యత పూర్తవుతుంది. ప్రొఫెషనల్ కిల్లర్స్‌ని అక్కడ తయారుచెయ్యరు. ఆ విషయం ఆ వృద్ధునికి తెలియదేమోననే అనుమానం వచ్చింది. అంతలోనే అతన్ని లెఫ్టినెంట్ పంపాడనే విషయం గుర్తొచ్చింది.

"నా శత్రువు పేరు శ్రీనివాసన్. పంజాబ్ మాజీ పోలీసు డైరెక్టర్ జనరల్. ప్రస్తుతం అతను ఢిల్లీలో నివసిస్తున్నాడు" చెప్పాడు అతను.

కమాండర్ పెదవుల మీద చిరునవ్వు అలవోకగా కదలాడి మాయమయింది.

"ఎంతో ఖర్చుపెట్టి ట్రయినింగ్ ఇచ్చిన వ్యక్తిని నీ కోసం ఎందుకు పంపాలి? ప్రస్తుతం ఢిల్లీ చుట్టూ పటిష్టమయిన రక్షణ కల్పించబడింది. ఒక మనిషి ఢిల్లీలోకి ప్రవేశించి పని పూర్తి చెయ్యడమంటే మామూలు విషయం కాదు" కమాండర్ అన్నాడు.

కొన్ని క్షణాల పాటు మౌనంగా వుండిపోయాడు జోగేందర్. తరువాత తలెత్తి కమాండర్ కళ్ళల్లోకి సూటిగా చూసి చెప్పాడు.

"ఈ పని మీరు నాకు ఉచితంగా చేయొద్దు. మన మధ్య ఒప్పందం కుదిరితే మీకు మొత్తం ఐదు లక్షల రూపాయలు యిస్తాను. లక్షరూపాయల కేష్ ఇక్కడ అందజేస్తాను. మీ మనిషి పనిలోకి దిగిన మరుక్షణం రెండు లక్షలు ముడతాయి. పని పూర్తయిన వెంటనే మరో రెండు లక్షలు చెల్లిస్తాను.

కమాండర్ చటుక్కున రమ్ముగ్లాసు అందుకని తాగాడు. మొదటి సారి తాగిన దానికంటే ఎక్కువ తాగాడు. భరించరాని ఉత్సాహం కలిగినప్పుడు మాత్రమే

అతను అలా తాగుతాడు.

"ప్రస్తుతం మా దగ్గర ఒక బ్యాచ్ ట్రయినింగ్ అవుతోంది. రెండు నెలల్లో వాళ్ల ట్రయినింగు పూర్తవుతుంది. అప్పుడు శ్రీనివాసన్‌ని హతమార్చడానికి ఒక మనిషిని ఢిల్లీ పంపుతాను. కానీ ఒక్క కండిషన్. పని పూర్తయిన తరువాత ఇస్తానంటున్న డబ్బు కూడా ఇక్కడే ఇవ్వాలి" అన్నాడు.

"నాకు ఢిల్లీలో ఒక మిత్రుడు వున్నాడు. మీ మనిషి ఢిల్లీ వెళ్ళి అతన్ని కలిస్తే రెండు లక్షలు యిస్తాడు. ఈ ఏర్పాట్లు చేసే నేను ఇక్కడకు వచ్చాను. లక్ష రూపాయలు నావెంట తెచ్చాను" చెప్పి తను వేసుకున్న కుర్తా పైకి లాగాడు. పొట్టచుట్టూ కట్టిన వెడల్పాటి గుడ్డ విప్పాడు. లోపల నుండి నోట్ల కట్టలు బయటపడ్డాయి. వాటిని, ఒక కాగితాన్ని కమాండర్ చేతికిచ్చి చెప్పాడు.

"మీ మనిషి ఢిల్లీలో ఈ నెంబరుకి ఫోనుచేస్తే నా మిత్రుడు అతన్ని కలుసుకుంటాడు. అతను మీవాడికి రెండు లక్షలు ఇచ్చి, ఎటువంటి సహాయం కావాల్సిన చేస్తాడు. శ్రీనివాసన్‌కి దైవభక్తి అధికం. పిల్లలు లేని అతను భార్యతో కలిసి ఎక్కువగా ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటాడు. అందుచేత వాళ్లకి ఎడబాటు కలగకుండా భార్యా భర్తల్ని ఒకేసారి చంపమని మీ మనిషికి చెప్పండి."

ఖాళీ అయిన గ్లాసు టేబుల్‌మీద పెట్టి మొదటిసారి బిగ్గరగా నవ్వాడు కమాండర్.

ఆయుధాలు ఉపయోగించి విచక్షణారహితంగా మనుషుల ప్రాణాలు తీసి అరాచకం సృష్టించడం అనే అంశం ప్రధానంగా అక్కడ పాఠాలు చెప్పబడతాయి. మారణాయుధంతో మనిషి ప్రాణం తియ్యడం అనే క్రీడ నేర్పుతాను.

దయాదాక్షిణ్యం, మానవత్వం, పాపభీతి అనే పదాలకు విలువలేని చోట 'ఎడబాటు' అనే ఓ కొత్తపదం వినడంవల్ల కమాండర్‌కి ఆ నవ్వు వచ్చింది.

అక్కడనుంచి బయలుదేరడం కోసం గేటుదాటి బయటకు వచ్చాడు జోగిందర్‌సింగ్. ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు.

ఉదయం తను వచ్చినప్పుడు ఛాలెంజ్ చేసిన సెంట్రీ అప్పుడు లేడు. అతనికి చెప్పి అక్కడనుంచి వెళ్లాలని అనుకున్నాడు. అతను లేకపోవడంతో చెట్టుకు కట్టిన గుర్రాన్ని విప్పి దాని శరీరాన్ని ఆప్యాయంగా నిమిరి ఎక్కి కూర్చున్నాడు. అది తిరుగు ప్రయాణం ప్రారంభించింది.

చాలా రోజుల తరువాత జోగిందర్‌సింగ్ మనసు ప్రశాంతంగా వుంది.

ఇద్దరు కొడుకులు చనిపోయినప్పుడు గుండెల్లో రగిలిన మంట, ఇన్స్‌పెక్టర్‌ని ఉగ్రవాదులు చంపినప్పుడు కొంత తగ్గింది.

కడుపుకోత తట్టుకోలేక ఏడుస్తూ పాదాలమీద పడి జరిగిన అన్యాయం గురించి మొరపెట్టుకున్నప్పుడు న్యాయం చేస్తానని చెప్పి, సబ్‌ఇన్స్‌పెక్టర్‌కి ప్రమోషన్ యిచ్చిన పోలీసు డైరెక్టరు జనరల్‌ని చంపడానికి ఒప్పందం కుదుర్చుకున్న తరువాత ఆ మంట పూర్తిగా చల్లారింది.

ఆస్థి అమ్మితే మూడు లక్షల యాభై వేలు వచ్చింది. కొద్ది ఖర్చుతో ఇన్స్‌పెక్టర్‌ని చంపించాడు. రెండు లక్షలు ఢిల్లీలోని మిత్రుని దగ్గర వుంచాడు.

ఒక లక్ష ట్రయినింగు క్యాంప్ కమాండర్‌కి యిచ్చాడు. శ్రీనివాసన్‌ని హతమార్చిన తరువాత డబ్బుకోసం స్నేహితుని దగ్గరకు వెళితే అతను ఒక కవరు యిస్తాడు. జాగ్రత్తగా ఆలోచించి రూపొందించిన పథకం అది.

చాలాసేపు ప్రయాణం చేసి ఒక గ్రామం చేరుకున్నాడు. అప్పటికి అర్ధరాత్రి దాటిపోయింది.

గుర్రాన్ని గుర్రాలశాలలో కట్టేసి అక్కడే గడ్డిమీద నడుం వాల్చాడు. ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. అంతులేని నక్షత్రాలు మినుకు మినుకుమని వెలుగుతున్నాయి. చనిపోయిన మనుషులు ఆకాశంలో చుక్కలుగా మారతారట.

తాత చనిపోయినప్పుడు "తాతేడి?" అని అమ్మమ్మని అడిగితే చుక్కలు చూపించి చెప్పింది. అదే నిజమయితే తన బిడ్డలు కూడా ఆ చుక్కల్లో వుంటారు.

హఠాత్తుగా లేచి ఆ చీకట్లో సరిహద్దువైపు కదిలాడు. తుఫాను అనంతరం ప్రశాంతత నెలకొన్నా, తుఫాన్ తాకిడికి ప్రకృతి దెబ్బతిన్నట్టు జోగిందర్‌సింగ్ మనసులో గాయం తాలూకు మచ్చ వుండిపోయింది.

అతను నడుస్తున్నాడు. మనసు పరిపరి విధాల ఆలోచిస్తోంది. ప్రకృతి ధరించిన నల్లటి ముసుగు తొలగి వెలుగెప్పుడు వస్తుందో? కాలంతోను, కాలధర్మాలతోను పనేంటి తనకి? ఒక మనిషి మరో మనిషికి అన్యాయం చేసినపుడు పగదీర్చుకునే మనిషి, ఆ రాత రాసిన వాడిమీద ఎందుకు పగ తీర్చుకోడు? ముక్కుపచ్చలారని తన బిడ్డల్ని పొట్టన బెట్టుకున్నారు. వాళ్ళు చేసిన పాపమేమిటి?"

జోగిందర్ సింగ్ కుడివైపున చీకటి నెమ్మదిగా కదిలినట్టయింది. అదేం పట్టించుకోకుండా బాహ్యస్మృతి కోల్పోయినట్టు అతను అడుగులు వేస్తున్నాడు. హఠాత్తుగా చీకట్లో ఒక మెరుపు మెరిసింది, దాని వెనుక పెద్ద చప్పుడు వినిపించింది.

ఒకదాని వెనుక ఒకటి వరుసగా మెరుపుల చప్పుడు.

జోగిందర్ సింగ్ శుష్క శరీరాన్ని చీల్చుకుని తూటాలు వెళ్ళసాగాయి. అతను ఆగకుండా అడుగులు ముందుకు వేస్తున్నాడు. అతికష్టం మీద చివరగా రెండడుగులు వేసి నేలమీద కూలిపోయాడు. అతని కుడిచెయ్యి నేలని ఆత్రంగా తడిమింది. మట్టిని నిండుగా తీసుకుని అతని గుప్పెట మూసుకుంది. ఒకనాడు అతని స్వేదంతో తడిసిన ఆ నేల ఇప్పుడు అతని రక్తంతో తడవసాగింది. తనని చుట్టుముడుతున్న సైనికులను అతను గమనించలేదు, తల్లి వడిలో బిడ్డ ఆదమరిచి నిద్రపోవడానికి ఆయుత్తమయినట్టు.

“అమ్మా!” అనే పదం అతని గొంతునుండి అస్పష్టంగా వెలువడింది.

# ప్రారంభం

ఉదయం ఐదుగంటలకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం టూ పైన ఆగింది జి.టి. ఎక్స్‌ప్రెస్.

ట్రైన్‌నుండి దిగిన జనంతో ఒక్కసారిగా ప్లాట్‌ఫాం నిండిపోయింది. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ నుండి బ్రీఫ్‌కేసుతో దిగాడో వ్యక్తి. అతను ప్లాట్‌ఫాం మీద కొన్ని క్షణాలపాటు నిలబడి చుట్టూ చూసిన తరువాత నెమ్మదిగా కదిలి బయటకు వచ్చాడు.

చకచకా నడుస్తూ రైల్వేస్టేషన్ ఎదురుగా వున్న మద్రాస్ గెస్ట్‌హౌస్ చేరుకున్నాడు. మేడమెట్లువైపు వెళుతున్న అతన్ని చూసి రిసెప్షనిస్టు నిద్రకళ్ళతోనే పలకరింపుగా నవ్వాడు. అతను అదేమీ పట్టించుకోకుండా పైకి చేరుకుని ఒక రూము తాళంతీసి లోపలకు వెళ్ళాడు. సరిగ్గా నలభై ఐదు నిముషాల తరువాత బయటకొచ్చి రూమ్ లాక్ చేశాడు. రోజున్నరపాటు ట్రైన్ ప్రయాణం చెయ్యడం వల్ల కలిగిన చికాకు వదుల్చుకుననట్టు అతను ఫ్రెష్‌గా కనిపిస్తున్నాడు.

అతను గెస్ట్‌హౌస్ బయటకు వచ్చిన మరుక్షణం ఓ కారు అతని ముందు ఆగింది. అతను వెనుకడోరు తెరిచి కూర్చున్నాడు. కారు బయలుదేరింది.

సూర్యోదయం కాకపోయినా వెలుగురేఖలు ఢిల్లీ నగరాన్ని ఆవరించాయి. ఎప్పుడూ రద్దీగా వుండే రోడ్లు బోసిగా కనిపిస్తున్నాయి.

కారు పార్లమెంట్ భవనం పక్కనుంచి అశోకారోడ్‌లోకి తిరిగింది. రోడ్డు పక్కనున్న బ్రహ్మాండమైన వృక్షాలు ఒక్కొక్కటి వెనక్కి వెళుతున్నాయి. దట్టంగా పెరిగిన ఎత్తైన చెట్ల మధ్య, ఆ చెట్ల కంటే ఎత్తుగా ఇండియా గేటు కనిపిస్తోంది.

♦ ♦ ♦

కారు హైదరాబాద్ భవన్ దాటి కుడివైపుకి తిరిగింది. కొంతదూరం వెళ్ళి ఒకచోట ఆగింది. రెండు క్షణాల తరువాత బ్యాక్ డోర్ తెరచుకుని అతను కిందకు దిగాడు. డోరుమూసి కారుకి ఆనుకుని నిలబడి వాచీ చూశాడు. ఆరు కావటానికి ఐదు నిముషాలు వుంది.

అతని కడిచెయ్యి ప్యాంట్ పాకెట్‌లోకి వెళ్ళి సిగరెట్ పాకెట్‌తో బయటకు వచ్చింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/HitList**

* * *